క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్‌లో ఎన్టీటీపీఎస్ ఉద్యోగుల ప్రతిభ



ఇబ్రహీంపట్నం: టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఎన్టీటీపీఎస్ జట్టు రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానం సాధించిందని సీఈ శివ రామాంజనేయులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24 నుంచి కాకినాడ డీఎస్ఏ స్టేడియంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ క్రీడా విభాగంలో ఓపెన్ సింగిల్స్‌లో డీఈఈ ఎస్.ఆదినారాయణ ప్రథమ స్థానంలో నిలిచారన్నారు. అన్ సీడెడ్ ఎంట్రీతో ఒక్క ఓటమి లేకుండా ఐదు రౌండ్లలో ప్రత్యర్థులపై విజయం సాధించారని చెప్పారు. ఆదినారాయణను ఆంధ్రప్రదేశ్ విద్యుత్ కార్పొరేషన్స్ స్పోర్ట్స్ అధికారి వడివేలు ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ టీం కెప్టెన్‌గా నియమించి అభినందించారు. టీమ్ ఈవెంట్‌లో సైతం ఎస్ఎం షఫీ, ఆదినారాయణ, గోవిందయ్య, మహమ్మద్ రఫీ పాల్గొని ఉత్తమ ప్రతిభతో విజయం సాధించి చాంపియన్‌గా నిలిచారు. వారిని సీఈ శివ రామాంజనేయులు అభినందించారు.

కార్నియాల సేకరణ



తిరువూరు: గంపలగూడెం గ్రామానికి చెందిన రాఘవరపు చిన్న సత్యం (64) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన నేత్రాలను లయన్స్ క్లబ్ సభ్యులు గోగిరెడ్డి కృష్ణారెడ్డి ప్రోత్సాహంతో కుటుంబ సభ్యులు దానం చేశారు. విజయవాడ ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల సిబ్బంది కార్నియాలను సేకరించారు.

విధులు బహిష్కరించిన వైద్యులు



చాట్రాయి: తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ పీహెచ్‌సీ వైద్యుల పిలుపు మేరకు శనివారం మండల పీహెచ్‌సీ వైద్యులు విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ రిపోర్టింగ్ సేవలు బంద్ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి విజయలక్ష్మీ, వైద్యులు శ్రీనివాసరెడ్డి, దుర్గాప్రసాదు, జ్యోతి పాల్గొన్నారు.

అద్దాల మండపం ప్రారంభం



చాట్రాయి: చాట్రాయి అయ్యప్పస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన అద్దాల మండపాన్ని శనివారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన గొర్ల నారాయణరావు, లక్ష్మీల కుమారుడు గొర్ల సుందరరావు, నాగలావణ్య దంపతుల సహకారంతో సుమారు రూ. 5 లక్షలతో మండపాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా ఆలయంలో అన్నదానం నిర్వహించారు.

జన సురక్ష పథకంతో సామాన్య ప్రజలకు భద్రత

భవానీపురం(విజయవాడపశ్చిమ): జన సురక్ష పథకం ద్వారా సామాన్య ప్రజలకు భద్రత లభిస్తుందని భారతీయ స్టేట్ బ్యాంక్(ఎస్‌బీఐ) వెస్ట్ రీజియన్ రీజనల్ మేనేజర్ శ్రీనివాసరావు అన్నారు. ఎస్‌బీఐ వెస్ట్ రీజియన్ ఆధ్వర్యంలో గొల్లపూడి పద్మావతి కల్యాణ మండపంలో వివిధ పథకాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. సైబర్ నేరగాళ్లు వివిధ రూపాలలో చేస్తున్న మోసాల పట్ల ఖాతాదారులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఈ సందర్భంగా పీఎంజేజేబీవై పథకం ద్వారా లబ్ధిదారు కుటుంబానికి రూ.2 లక్షల చెక్‌ను అందజేశారు.

రోడ్డుపై పశువులు.. పొంచి ఉన్న ప్రమాదాలు

- అధికారుల నిర్లక్ష్యంతో రోడ్లపై పశువుల సంచారం
- యజమానులకు నోటీసులతో సరిపెడుతున్న అధికారులు
- పశువుల సంచారాన్ని నివారించాలని ప్రజల వినతి



కొండపల్లిలో జాతీయ రహదారిపై సంచరిస్తున్న పశువులు

ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాల్టీ పరిధిలోని జాతీయ రహదారులు, పట్టణ ప్రధాన రోడ్లపై పశువుల సంచారం అధికమైంది. రోడ్డుపై ఇవి సంచరిస్తూ వాహన చోదకులను ప్రమాదాల్లోకి నెడుతున్నాయి. కొన్ని సమయాల్లో వాటికవే కుమ్ములాడుకుంటూ వాహనదారులపైకి దూసుకొస్తున్నాయి. పశువుల యజమానులు పాలు తీసే సమయానికి పశువులను ఇళ్లకు తీసుకు వెళుతున్నారు. పాలు పిండుకుని మరలా రోడ్లపైకి వదిలేయడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో మున్సిపల్ అధికారులు పశువుల యజమానులకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. వాటిని కట్టడి చేసేందుకు సరైన చర్యలు తీసుకోలేదు. మున్సిపాల్టీ పరిధిలో సుమారు 160 ఆవులు ఉండగా వాటిలో యజమానుల పరిరక్షణ లేని అనేక ఆవులు రోడ్లపై సంచరిస్తూ వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి.

పశువులతో ప్రమాదాలు

మున్సిపాల్టీ పరిధిలో 65, 30వ నంబర్ జాతీయ రహదారులు రెండు ఉన్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా పదుల సంఖ్యలో పశువులు రోడ్లపై తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇటీవలి కాలంలో కొండపల్లిలో రోడ్లపై తిరుగుతున్న ఆవులు తగిలి ఓ ద్విచక్ర వాహన దారుడు గాయాలపాలయ్యాడు. ఆమధ్య కాలంలో ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో ఓ పశువు రంకెలేసి ఓ టిఫిన్ సెంటర్ యజమానిపై దాడి చేసింది.



ఇబ్రహీంపట్నంలో జాతీయ రహదారిపై రాత్రివేళ సంచరిస్తున్న పశువులు

గాయాల పాలైన వీరు వైద్యశాలల్లో చికిత్స పొందారు. లెక్కకు రాని ఇటువంటి ఘటనలు అనేకం ఉన్నాయి. ఎద్దులు ఒకదానితో ఒకటి కుమ్ములాడుకునే సమయాల్లో ప్రజలపైకి దూసుకొచ్చి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. పశువులు వాహనదారులకు తగిలి బ్రెయిన్ డెడ్ అయిన సందర్భాలు గతంలో చోటు చేసుకున్నాయి.

మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతోనే..

కూరగాయల దుకాణాల్లో పాడైన వాటిని వ్యాపారులు రోడ్లపై పడవేయడం, పండ్ల వ్యాపారులు సైతం దుకాణాల పక్కన వాటిని పారబోయడం వలన పశువులు వాటి ఆహార అన్వేషణలో భాగంగా రోడ్ల వెంట తిరుగుతున్నాయి. ఆహారం వెతుకులాటలో వాహనదారులు, ప్రజలు అడ్డొస్తే కుమ్మేసే పరిస్థితి నెలకొంది. చెత్తకుండీల్లో చెత్తను తరలించడంలో అధికారుల నిర్లక్ష్యంతో కుండీల్లో ఆహారం కోసం పశువులు రోడ్లపై సంచరిస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.

నోటీసులతో సరి..

సుమారు ఆరు నెలల కిందట రోడ్లపై ఆవులు సంచారం లేకుండా చేసేందుకు మున్సిపల్ అధికారులు ఆవుల యజమానులకు నోటీలు ఇచ్చారు. యజమానులు ఆ నోటీసులను ఖాతరు చేయలేదు. మున్సిపల్ అధికారుల కూడా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. పశువులు రోడ్లపై తిరగకుండా చేసేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోలేదనే వాదన ప్రజల నుంచి వినిపిస్తోంది. పశువులు రోడ్లపై సంచరించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్లపైకి రాకుండా చూడాలి



రోడ్లపై విచ్చలవిడిగా పశువులు సంచరిస్తున్నాయి. రోడ్లపై తిష్ట వేస్తే రెండు, మూడు గంటల పాటు లేవవు. వాహనదారులే జాగ్రత్తలు తీసుకుని వాహనం నడపాల్సి వస్తోంది. ఒక్కో సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. పశువులను రోడ్లపై తిరగకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– జి.ప్రసాద్, కొండపల్లి

పంట కోత ప్రయోగాలపై శిక్షణ

ముసునూరు: పంట కోత ప్రయోగాలతో పంటల దిగుబడిని అంచనా వేయవచ్చని మండల వ్యవసాయాధికారి ఆలూరి చాముండేశ్వరి అన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం ముసునూరు రైతు సేవా కేంద్రంలో సిబ్బందికి పంటకోత ప్రయోగాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. చాముండేశ్వరి మాట్లాడుతూ ప్రయోగాల ఆధారంగా సీజన్‌లో ఉత్పత్తి అయిన పంటను అంచనా వేయవచ్చన్నారు. ఫసల్ బీమా యోజనలో నమోదైన రైతులకు ప్రకృతి వైపరీత్యాల వలన పంటకు నష్టం వాటిల్లితే దానిని అంచనా వేసి నష్టపరిహారం చెల్లించేందుకు ఉపకరిస్తాయని చెప్పారు. ఈ నెల 30వ తేదీ లోగా వరి పంట ఈ–క్రాప్ నమోదును పూర్తి చేయాలని సూచించారు. రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలుకు అవసరమైన పరికరాలను సిద్ధం చేసుకోవాలని చెప్పారు. సహాయ గణాంకాధికారి సుప్రియ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

30న వాహనాలకు వేలం

తిరువూరు: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు ఈ నెల 30న వేలం నిర్వహిస్తామని తిరువూరు సర్కిల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నిక్సన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీజ్ చేసిన 9 ద్విచక్ర వాహనాలకు తిరువూరు ఫ్యాక్టరీ సెంటర్‌లోని తమ స్టేషన్ ఆవరణలో వేలం నిర్వహిస్తామన్నారు. వివరాలకు సెల్: 80087 77246, 80198 22392 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

రేపు తిరువూరు కౌన్సిల్ సమావేశం

తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం ఈ నెల 29న జరుగుతుందని చైర్‌పర్సన్ కె. నిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశంలో కౌన్సిలర్లు ప్రతిపాదించిన అంశాలపై చర్చించి తీర్మానిస్తారన్నారు.

లలితా త్రిపుర సుందరీ.. నమోస్తుతే

నూజివీడు: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆరో రోజు అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయాలకు చేరుకుని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. నూజివీడు పట్టణంలోని శ్రీ కోటమహిషాసురమర్ధని అమ్మవారి ఆలయంలో అమ్మవారు శనివారం శ్రీ లలితా త్రిపుర సుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు జి. సత్యనారాయణాచార్యుల నేతృత్వంలో అమ్మవారికి వేకువ జామునే పంచామృతాభిషేకం, కుంకుమార్చన, చక్రార్చన నిర్వహించారు. తెల్లవారుజామున ఐదు గంటల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ఈఓ అలివేణి ఏర్పాట్లను పర్యవేక్షించారు. జంక్షన్ రోడ్డులోని జ్ఞాన సరస్వతి ఆలయంలో, కోనేరుపేట టీటీడీ కల్యాణమండపం వద్ద, పాతపేట జ్ఞాన సరస్వతీ ఆలయంలో, మండలంలోని సిద్ధార్థ నగర్‌లో, 32వ వార్డులోని శ్రీ కనకదుర్గ ఆలయాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

చాట్రాయి: దేవీ నవరాత్రుల సందర్భంగా ఆరో రోజు శనివారం కనకదుర్గ అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసుకున్న అమ్మవారి విగ్రహాల వద్ద భక్తులు పూజలు నిర్వహించారు.

గాయత్రీ దేవి అలంకరణ

బలివే (ముసునూరు): బలివేలోని సుప్రసిద్ధ బలే రామ లింగేశ్వరస్వామి దేవస్థానం వద్ద శనివారం గాయత్రీదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. రాజరాజేశ్వరి అమ్మవారికి గాయత్రీదేవి అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సమీప గ్రామాలకు చెందిన పలువురు మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. ముసునూరు, చెక్కపల్లి, లోపూడి, రమణక్కపేటల్లోని శ్రీకోదండ రామాలయాల్లో లలితా త్రిపురసుందరీ దేవి అలంకరణలో ఉన్న అమ్మవారికి మహిళలు అభిషేకాలు నిర్వహించి, కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు చేశారు.



నూజివీడు సిద్ధార్థ నగర్‌లో పూజలు



నూజివీడులో అమ్మవారి అలంకరణ

- విస్సన్నపేట: స్థానిక కనకదుర్గా అమ్మవారి దేవస్థానంలో శనివారం అమ్మవారిని, పుట్రేల మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు.
- జి.కొండూరు: మునగపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాన్ని శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.
- ఇబ్రహీంపట్నం: కిలేశపురం, కొండపల్లి, కొటికలపూడి, ఇబ్రహీంపట్నంలోని పలు ఆలయాలు, చలువ పందిళ్లలో కొలువైన అమ్మవారికి భక్తులు పూజలు నిర్వహించారు. మూలపాడు శివాలయంలో అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు ఉత్సవ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.



ఆరుగొలనుపేటలో అమ్మవారికి పూజలు

- మైలవరం: మైలవరం తిరువూరు రోడ్డులోని పాండురంగ స్వామి రేణుకాదేవి ఆలయంలో అమ్మవారిని శ్రీలలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.
- తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలోని పలు దేవాలయాల్లో అమ్మవారికి శనివారం విశేషాలంకారాలతో పూజాదికాలు నిర్వహించారు. తిరువూరు రాజుపేట అష్టలక్ష్మీ ఆలయం, నెమలి శ్రీ వేణు గోపాలస్వామి దేవాలయాల్లో సౌభాగ్యలక్ష్మిగా, గంపలగూడెం రామాలయం వీధిలోని నవరాత్రి పందిరిలో, తిరువూరు శ్రీరామలింగేశ్వరాలయం, శ్రీచంద్రమౌళీశ్వరాలయాల్లో, చౌటపల్లి, తిరువూరు రాజుపేట ఆలయాల్లో అమ్మవార్లను లలితా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించి పూజలు చేశారు.
- ఆగిరిపల్లి: స్థానిక రుద్రభూమి వద్ద కనక దుర్గమ్మ ఆలయంలో అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవీగా దర్శనమిచ్చారు. సహస్రనామార్చన, కుంకుమ పూజలు నిర్వహించారు. వెంకటాచలం మండపంలో అమ్మవారిని శాకంబరీ దేవిగా అలంకరించి పూజలు చేశారు. రజక వీధిలో మహాలక్ష్మీ దేవిగా, రేణుక క్షేత్రంలో లలితా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో అమ్మవారికి పూజలు చేశారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు.




మునగపాడు గ్రామంలో అమ్మవారి అలంకరణ



కిలేశపురం గంగానమ్మ ఆలయంలో అమ్మవారు



కొటికలపూడిలో శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా..



మైలవరంలో అమ్మవారి అలంకరణ



బలివేలో గాయత్రీ దేవిగా అమ్మవారి దర్శనం

ఆరోగ్య సిబ్బంది సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మైలవరం: ఆరోగ్య సిబ్బంది అందిస్తున్న సేవలను గ్రామస్తులు, ముఖ్యంగా మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఎం. శరత్‌బాబు అన్నారు. పుల్లూరు హెల్త్ కేర్ సెంటర్–1లో స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆరోగ్య సిబ్బంది వివరించారు. సర్పంచ్ కొనకాల నాగమల్లేశ్వరి, డాక్టర్ ఎం. శరత్‌బాబు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిరక్షణకు తాము సహకరిస్తామని మహిళలతో ప్రమాణం చేయించారు.

80 మందికి వైద్య పరీక్షలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కామినేని హాస్పిటల్స్, వాసన్ ఐ కేర్, ఈఎస్ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో కొండపల్లి డీఏవీ పాఠశాలలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జరిగిన శిబిరంలో 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డాక్టర్లు లక్ష్మణ్, పల్లవి, అరుణ కృష్ణ, బీజేపీ సీనియర్ నాయకులు నూతులపాటి బాలకోటేశ్వరరావు, రేగళ్ల రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పుల్లూరులో ప్రతిజ్ఞ చేయిస్తున్న డాక్టర్ శరత్‌బాబు



మైలవరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

- వేమిరెడ్డిపల్లి(విస్సన్నపేట): వేమిరెడ్డిపల్లి గ్రామ సచివాలయం వద్ద స్వస్థ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. తెల్లదేవరపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆయ్యా.. నా బిడ్డను చూపించండి

మృతురాలు గాయత్రి తల్లి నాగేంద్రమ్మ వేడికోలు

జి.కొండూరు: కన్న బిడ్డను ఆఖరిచూపు కూడా చూసుకోలేదు.. నా బిడ్డను నాకు చూపించండయ్యా అని మృతురాలు గాయత్రి తల్లి నాగేంద్రమ్మ వేడుకుంటోంది. మైలవరంలో గత నెల 31న కన్న తండ్రి చేతిలో హత్యకు గురైన చిందే గాయత్రి (14) తల్లి నాగేంద్రమ్మ గంజాయి కేసులో నూజివీడు జైలు నుంచి గురువారం బెయిల్‌పై విడుదలై జి.కొండూరు మండల పరిధి విద్యానగరంలో తన అక్క స్వప్న వద్దకు చేరింది. ఆమె శనివారం 'సాక్షి'తో మాట్లాడింది.

నా బిడ్డను ఏం చేశారు..

గాయత్రిని హత్య చేసిన తర్వాత మృతదేహాన్ని వాగులోనే పడవేశాడని ఎలా తేల్చారని నాగేంద్రమ్మ ప్రశ్నించింది. ఆధారాలు దొరక్కుండా ఎక్కడైనా పాతి పెట్టి ఉండవచ్చని సందేహం వ్యక్తంచేసింది. పగటి సమయంలో ఇంట్లో హింసించి హత్య చేస్తుంటే బాజీ మొదటి భార్య నాగమ్మ, బాజీ తల్లి, ఆయన పిల్లలకు తెలియకుండా ఎలా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేసింది. వీరందరినీ కేసులో ఎందుకు చేర్చలేదని ప్రశ్నించింది. బాజీ చెప్పినట్లు అతని స్నేహితుడు రోహిత్‌తో చనువుగా ఉన్నందుకే చంపితే అతని స్నేహితుడిపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని డిమాండ్ చేసింది. కన్న కూతురు హత్యకు గురైతే తల్లిగా తెలుసుకునే హక్కు తనకు లేదా అని నాగేంద్రమ్మ కన్నీటి పర్యంతమైంది. మైనర్‌గా ఉన్న తన కూతురు గాయత్రిని తీసుకెళ్లి పెళ్లి చేసుకొని శారీరకంగా కలిసిన సన్నీ అనే యువకుడి మీద ఎటువంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలన్నారు. ఈ కేసును తిరగతోడి తన కూతురు ఆచూకీ కనిపెట్టాలని కోరారు. తనకు తన కూతురు చివరి చూపు దక్కించి, బాజీకి మరణశిక్ష పడేలా చేసి న్యాయం చేయాలని నాగేంద్రమ్మ వేడుకుంది. ఇదే విషయమై మైలవరం పోలీసులను కలిసి తనకు న్యాయం చేయాలని కోరతానని ఆమె 'సాక్షి'తో చెప్పారు.



విలపిస్తున్న నాగేంద్రమ్మ

ఇసుక స్టాక్ పాయింట్ తనిఖీ

నూజివీడు: మీర్జాపురంలోని ప్రభుత్వ ఇసుక స్టాక్ పాయింట్‌ను సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న శనివారం తనిఖీ చేశారు.ఇప్పటివరకు ఎన్ని టన్నుల ఇసుక వచ్చింది, ఎంత విక్రయించారు, ఇంకా ఎంత నిల్వ ఉందనే వివరాలను స్టాక్ పాయింట్ ఇన్‌చార్జీని అడిగి తెలుసుకున్నారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ధర ప్రకారమే ఇసుకను విక్రయించాలని, ఎక్కువ ధరకు విక్రయిస్తున్నట్లుగా ఫిర్యాదులు వస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్ గుగులోతు బద్రూనాయక్ ఉన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వినూత్న

కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై ప్రచారం చేయండి

వైఎస్సార్ సీపీ తిరువూరు పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ

తిరువూరు: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడచినా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని వైఎస్సార్ సీపీ తిరువూరు పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ అన్నారు. తిరువూరు 18వ వార్డులో శనివారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమలు పేరుతో ప్రజలను మోసగించడం, విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన వైనాన్ని వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయాలని చెప్పారు. వైఎస్సార్ సీపీ రూపొందించిన క్యూ ఆర్‌కోడ్‌ను ఆవిష్కరించారు. నగర పంచాయతీ కౌన్సిలర్లు తంగిరాల వెంకటరెడ్డి, పరసా శ్రీనివాసరావు, మోదుగు ప్రసాద్, గుంటూరు మస్తాన్, పార్టీ నాయకులు కాలసాని గోపాల నాగేశ్వరరావు, సుధారాణి, జాకీర్, యర్రపోతు వరలక్ష్మి, సుధారాణి పాల్గొన్నారు.



క్యూ ఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

శంకుస్థాపనకే పరిమితం

ఆగిరిపల్లి: స్థానిక స్టేట్ బ్యాంకు నుంచి, వేద పాఠశాల వరకు సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి మోక్షం కలగడం లేదు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఇక్కడ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణానికి రూ.50 లక్షల నిధులు మంజూరయ్యాయి. మంత్రి కొలుసు పార్థసారథి శంకుస్థాపన కూడా చేశారు. కానీ ఆరు నెలలు గడిచినా ఇప్పటివరకు పనులు ప్రారంభం కాలేదు. ఈ రోడ్డులో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో చిన్నపాటి వర్షానికి మురుగునీరు ఇళ్లల్లోకి చేరుతోందని, గుంతలు పడిన రోడ్డులో వాహనదారులు ప్రయాణిస్తుంటే ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి త్వరితగతిన సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



స్టేట్ బ్యాంకు వద్ద శంకుస్థాపన చేసిన శిలాఫలకం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: పట్టణంలోని ట్రిపుల్ ఐటీ సబ్ స్టేషన్‌ను ఈనెల 28న మరమ్మతులు చేయనున్న నేపథ్యంలో ఆదివారం ఉదయం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ ఈఈ ఎ. సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏరియా ఆస్పత్రి, గొడుగువారిగూడెం, గాంధీనగర్, స్టేషన్ తోట, ధంధం గార్డెన్, కుమ్మరిపేట, అజరయ్యపేట ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.